

# అనుభవం

సి.హెచ్.మధు

అనుభవం గుణపాఠం నేర్పుతుందని పెద్దలంటారు. ఆర్.ఎం.పి. డాక్టరు సత్యనారాయణకు కల్గిన అనుభవం అలాంటిదే !

✿ ✿ ✿

నిజామాబాద్ గాజులపేటలో చాలా కాలం నుండి ఆర్.ఎం.పి డాక్టర్‌గా పని చేస్తున్న సత్యనారాయణ తనకు కలిగిన ఒకే ఒక కొడుకును ఎం.బి.బి.యస్ చదివించాలనుకొన్నాడు. ఈ కాలంలో యం.బి.బి.యస్ చదివించాలంటే మాటలు కాదు లక్షలు... లక్షలు.... కావాలి. చదువు పూర్తి అయ్యేవరకు కోటి దాటుతుంది. ఒక డాక్టర్ చదవటానికి ఇంత అవసరమా? ఇంత ఖర్చు ఎందుకవుతుంది ? - ఆర్.ఎం.పి. డాక్టరుగా నలుపది సంవత్సరాల అనుభవమున్న సత్యనారాయణకు అర్థం కాలేదు. దోపిడీ చదువుల సంగతి ఆయనకేం తెల్సు, పాతకాలం చదువుల మనిషి. ఎప్పుడో నలుపది సంవత్సరాల క్రితం నాలుగో తరగతి చదివిన మనిషి యం.బి.బి.యస్ చదువటానికి ఇన్ని లక్షల ఖర్చు ఎందుకు అవుతుందో ఎందుకు చేయాలో ఎన్ని రోజులు ఆలోచించినా సత్యనారాయణకు అర్థం కాలేదు.

డిగ్రీ ప్రథమ శ్రేణిలో ర్యాంకుతో పాసయిన తన కొడుకును యం.బి.బి.యస్ చదివించాలని తనకుంది తాను డాక్టర్. తన కొడుకు డాక్టర్ కావాలి. ఇది సత్యనారాయణ ఆశ. వ్యవస్థ లక్షణమది. కలెక్టర్ కొడుకు కలెక్టర్ డాక్టర్ కొడుకు డాక్టర్ రిక్షావాడి కొడుకు రిక్షావాడు అనే వాదన వుండనే వుంది. సత్యనారాయణ ఆ ఉద్దేశ్యంతో తన కొడుకుని డాక్టర్‌గా భావించటం లేదు. ఈ కాలంలో డాక్టర్ అంటే బంగారు గుడ్లు పెట్టే బాతు అని అందరికి తెల్సు. యం.బి.బి.యస్ చదివి డాక్టర్ డిగ్రీ తగిలించుకొని లక్షలు సంపాదించవచ్చు. న్యాయమో అన్యాయమో ఆ సంగతి పక్కనుంచుదాం ! న్యాయం, అన్యాయం పదాలు సెంటిమెంట్ పదాలయ్యాయి. సెంటిమెంట్‌ను వదిలించుకొన్నవాడే ఈ కాలంలో ఈ సమాజంలోని మనిషి.

డాక్టర్ సత్యనారాయణ అలాటి మనిషేమీ కాదు. పైసలిస్తే పారేసే మనిషేమీ కాదు కాని జలగలా పిండుక తినటంకూడా ఆయనకు అలవాటు లేదు. తన కొడుకు డాక్టరయి ప్రజలను జలగలా పీడించి లక్షలు కోట్లు సంపాదించాలని ఆయనకు లేదు. డాక్టరంటే రోగులకు సేవ చేయటమని సత్యనారాయణకు తెల్సు. రోగులకు సేవ చేయటానికి డాక్టర్ చదవాలి. తాను చిన్న వైద్యుడయినా, పట్టా లేని వైద్యుడయినా తనను దేవునిలా భావిస్తున్న ప్రజలున్నారు. అలా తన కొడుకును ప్రజలు భావించాలి. సంపాదన సంగతేమో కానీ తన కొడుకు డాక్టరయి ప్రజలకు రోగులకు సేవ చేయాలి. జన్మ ధన్యమయినట్టు.... పుట్టినందుకు ఫలితం... లేకపోతే ఎందుకీ జన్మ పుట్టటం.... గిట్టటం.

ఈ దృష్టితో డాక్టర్ చదివించాలనుకొన్నాడు సత్యనారాయణ.

డాక్టర్ చదివించడానికి లక్షలు తన దగ్గరలేవు కానీ చదివించాలి. తన తండ్రి సంపాదన తనకున్న పదెకరాల భూమి. అమ్మి చదివించాలి. అమ్మకపోతే డాక్టర్ చదివించడం సాధ్యం కాదు. అమ్మాలనుకున్నాడు సత్యనారాయణ.

కొడుకును డాక్టర్ చదివించాలని కృత నిశ్చయానికొచ్చిన సత్యనారాయణకు ఒక విషయం అర్థం కాలేదు. డాక్టర్ చదువుకు లక్షలు ఖర్చు ఎందుకవుతాయి? – ఒక డాక్టర్ ప్రోడక్ట్ రేట్ కోటి రూపాయలా ? – ఇంత ఖర్చు ఎందుకూ? – ఆలోచించాడు. తెల్సిన వారిని మామూలుగా అడిగాడు. ఎవరి నుండి సరియైన సమాధానం రాలేదు. సంతృప్తికరంగా ఎవరూ జవాబు చెప్పలేదు. చెప్పిన జవాబు సత్యనారాయణకు సంతృప్తి కల్గించలేదు.



'రవితేజమ్' దినపత్రికచే ప్రతిమాసం ప్రచురింపబడే సాహితీమాసాను బంధం "సాహితీతేజమ్" వార్షికోత్సవ సంచికను 8-8-08 తేదీన హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గానసభ కళాసుబ్బారావు వేదికపై శ్రీ పోతుకూచి సాంబశివరావు ఆవిష్కరించారు. చిత్రంలో ఎడమనుండి మాటీవీ న్యూస్ ప్రెజెంటర్ దేవీరెడ్డి, జి.వి.ఆర్. కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షులు గుదిబండి వెంకటరెడ్డి, ఎ.ఐ.ఆర్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ సుధామ, సభాధ్యక్షులు డా॥ పింగళి జగన్నాథరావు, డా॥ పోతుకూచి సాంబశివరావు, రచయిత్రి శీలాసుభద్రాదేవి, సాహితీతేజమ్ ఎడిటర్ పొత్తూరి సుబ్బారావు ఉన్నారు.

డాక్టర్ చదువుకు లక్షలు కోటి వరకు కావాలంటే ఎవరైనా నమ్ముతారు. అంత ఖర్చు ఎందుకూ? – అంటే ఎవరు చెప్పగలరు. సంపాదించటానికని ఎవరైనా చెప్పలగరు. ఎలా సంపాదిస్తారు? – డాక్టర్లు ఎలా సంపాదిస్తున్నారో ఇప్పుడు అందరికీ తెల్సు. ఈ మాట సత్యనారాయణ అంగీకరించడు. డాక్టర్ సత్యనారాయణ సత్తెకాలపు మనిషా ? – కాదు. కానీ సత్యం తెల్సిన వ్యక్తి. ధర్మరాజుకు చెడ్డవాడు ఎంత వెదికినా దొరుకలేదట. డాక్టర్ సత్యనారాయణ మంచోడు. ఆర్.యం.పి. డాక్టరే గానీ – తక్కువ ఫీజు తీసుకునేవాడు. తక్కువ మందులు వ్రాసి యిచ్చేవాడు. ఇప్పటి డాక్టర్ల లాగా కాదు. రోగం లేకున్నా రోగం వుందని చెప్పటం, రోగాన్ని భూతద్దంలో చూపటం పరీక్షలు అవసరం లేకున్నా వ్రాయటం ఒకటికి పదిమందులు వ్రాయటం. మామూలు ఆర్.యం.పి డాక్టర్ సత్యనారాయణ అయినా ప్రజలలో పేరున్న డాక్టర్. ఇప్పటి డాక్టర్లు ఇలా చేస్తున్నారంటే నమ్మని డాక్టర్. నమ్మకంలేని డాక్టర్ అవసరం లేకుండా ఏ డాక్టర్ మందులు వ్రాయడు ఛ ! అవసరం లేకుండా ఏ డాక్టర్ అయినా కోస్తాడా? ఇలా మాట్లాడేవాడు. డాక్టర్ వృత్తి పవిత్రమైంది కనుక డాక్టర్లంతా పవిత్రులని సత్యనారాయణ భావించేవాడు. అందుకే డాక్టర్ చదువుకు కోటి ఖర్చు ఎందుకూ? – అనే అమాయక ప్రశ్న ఆయనకు వచ్చింది. ఇటు చదువు ఖర్చు నమ్మటం లేదు. అటు డాక్టర్‌గా కోట్లు సంపాదించవచ్చు. అంటే నమ్మటం లేదు. ఆయనకు నమ్మకం కుదరటం లేదు. ఎలా సంపాదిస్తాడు? – డాక్టర్‌ఫీజు. అంతేగా పెదవి విరిచేవాడు. వర్తమాన సమాజంలో డాక్టర్ల పోకడ తెలియని సత్యనారాయణ అయినా నరే తన కొడుకును డాక్టర్ చదివించాలనుకున్నాడు.

నిర్ణయం తీసుకున్నా –

డాక్టర్ చదువుకు ఇంత ఖర్చు ఎందుకూ? – అని ప్రశ్న మెరమెరగానే వుంది. లక్షలు కోట్లు సంపాదించటానికి అనే జవాబు ఆయనకు నచ్చలేదు డాక్టరయి వుండి లక్షలు కోట్లు సంపాదించటమేమిటి? – సంపాదన కొరకే డాక్టర్ చదువు అనే మాట ఆయనకు నచ్చలేదు.

ఇప్పటి చదువులు అలా ఏడ్చాయని ఎవరైనా అంటే నవ్వి వూరుకునేవాడు సత్యనారాయణ. ఓనమాలు దిద్దే ఎల్.కె.జి పుస్తకాల ఖర్చు వెయ్యి పైనే వుంటుంది. డాక్టరుకు లక్షలు ఎందుకు కావు ?

✿ ✿ ✿

సత్యనారాయణ తన కొడుకును హైద్రాబాద్ పంపించి డాక్టర్ చదివించాలని వున్నా – కొడుకుకు

ఇష్టం లేదు. కొడుకు పేరు సురేష్. తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు. ఆ రాయికి ఈ రాయికి ఆ దేవునికి, ఈ దేవునికి మొక్కగా పుట్టిన కొడుకు. సత్యనారాయణ గారాబంగా పెంచారు. ఇప్పుడు ఇరువది దాటిన వయస్సు. అరవై దాటిన తండ్రిని అరవైకి దగ్గర్లో వున్న తల్లిని విడిచి డాక్టర్ చదువటానికి హైద్రాబాద్ వెళ్లటం ఆయనకు ఇష్టం లేదు. పుట్టి పెరిగిన ప్రాంతాన్ని ముసలోళ్లు ఇద్దరిని విడిచి ఎక్కడికో వెళ్ళటం ఆయనకిష్టం లేదు. వున్న పదిఎకరాలు దున్నుకొని బ్రతికితే హాయిగా బ్రతకచ్చు అనుకొన్నాడు. వున్న పది ఎకరాలు అమ్మి డాక్టరు చదువుకు పెట్టటం ఆయనకు అస్సలు ఇష్టం లేదు.

అయినా తండ్రి బలవంతంపై డాక్టర్ చదువటానికి ఒప్పుకున్నాడు సురేశ్.

✿ ✿ ✿

అటూ ఇటూ సురేశ్‌ను డాక్టర్ చదివించటానికి చదువటానికి డాక్టర్ సత్యనారాయణ కుటుంబం సిద్ధమవుతూ వుంది.

✿ ✿ ✿

సురేశ్‌ను డాక్టర్ చదివించటానికి డాక్టర్ సత్యనారాయణ అతని భార్య, కొడుకు సురేశ్ మానసికంగా ఆర్థికంగా సిద్ధమవుతున్న సమయాన ఓ అర్ధరాత్రి -

అకస్మాత్తుగా సత్యనారాయణకు కడుపు నొప్పి ప్రారంభమయ్యింది.

ఇదేమిటీ కడుపునొప్పి అనుకొని లేచి నిమ్మకాయ నీళ్ళు త్రాగాడు. తగ్గలేదు. ఆయనే నలుపది ఏళ్ళుగా ఆర్.యం.పి డాక్టర్ కనుక కొన్ని బిళ్ళలు వేసుకున్నాడు. తగ్గలేదు. అర్ధరాత్రి ఇంకా రెండు దాటలేదు. భార్యను లేపాడు. మొదటిసారిగా భార్య కంగారుపడింది. కుడివైపు నొప్పి భయంకరంగా వుంది. భార్య కొడుకును లేపింది. కొడుకు మరీమరీ కంగారు పడ్డాడు. హాస్పటల్ వెళ్దామన్నారు. "వద్దు తెల్లవారేవరకు చూద్దాం" అన్నాడు. బాధలో సత్యనారాయణ వినలేదు ప్రేమ... కంగారు... ఆందోళన... ఏమైతుందోననే భయం... కొడుకు ఆటోకు పరుగు తీసాడు. భార్య బట్టలు సదిరింది. అలమార తెరిచి ఎన్ని రూపాయలుంటే అన్ని పర్సులో కుక్కింది. హాస్పటల్ మాట... ఒక్కొక్కసారి సంచెడు పచ్చనోట్లయినా చాలవు. దవాకాణకు పచ్చనోట్ల తిండి కావాలి. ఈ మధ్య కడుపు పెరిగింది.

24 గంటలు సదా ప్రజల సేవలో వుండే హైటెక్ ఆసుపత్రికి తీసుకెళ్ళారు.

ఉరుకులూ.. పరుగులూ...

డాక్టర్‌ను లేపటం, వంద యిచ్చి చీటి వ్రాయించే వరకు డాక్టర్ లేవడు. అర్ధరాత్రి డ్యూటీ డాక్టరే కానీ - నిద్రలో జోలటం లేదా నిద్ర రాకుండా వుండాలంటే సిస్టర్స్‌తో ముచ్చట్లు - ఇదంతా మామూలేగా....

డాక్టర్ సచ్చితానందం మెల్లగా వచ్చి పెద్దాయన సత్యనారాయణను అటూ ఇటూ చూచి వూపిరి పీల్చుకొమ్మని - విడువుమని ఓ ఐదు నిమిషాలు సర్కస్ చేయించి ఓ ఇంజక్షన్ వ్రాసి తెచ్చుకోమన్నాడు.

అర్ధరాత్రి ఎక్కడ దొరుకుతుంది ఇంజెక్షన్ ఆసుపత్రిలో వుండవా? - సత్యనారాయణకు అన్నీ ప్రశ్నలే.

కొడుకు సురేశ్ ఉరుకులూ - పరుగులు ఆటోలో వెళ్ళి ఆటోలో వచ్చాడు. సూది, సూదిమందు ఖరీదు అరువది రెండు.

సత్యనారాయణకు ఇంజెక్షన్ యిచ్చారు. కొంచెం మత్తులోకెళ్ళాడు సత్యనారాయణ. ఇంజెక్షన్ యివ్వగానే తీసుకెళ్ళమంటారని సత్యనారాయణ భావించారు. కానీ అలా జరగలేదు. రోగి ఊహించినట్టుగా డాక్టర్ వుంటాడా...? - అసంభవం డాక్టర్ యిష్టం. ఒకసారి ఆసుపత్రి గడపలో అడుగుపెట్టిన తర్వాత అంతా డాక్టర్ల యిష్టం... అంతా మన కోసమేగా... మనరోగం బాగుకోసమేగా... దేవుడు మన ఆలోచనలకు అనుగుణంగా ప్రవర్తిస్తాడా? - డాక్టర్ అంతే... డాక్టర్‌ను దేవుడనే అంటాంగా......!

"అడ్మిట్ కావాలి ఆపరేషన్ అవసర ముంటుందేమో ఓ మూడువేలు కౌంటర్‌లో జమ చేయండి !" అన్నాడు డాక్టర్.

"అడ్మిట్ వద్దు ఏమొద్దు ఇంటికెళ్దాం ఎలా అయితే అలా అవుతుంది" అన్నాడు బాధతో సత్యనారాయణ మత్తు ఇంజెక్షన్ ఇచ్చినట్టున్నారు మత్తులో.

సత్యనారాయణ మాట భార్య కొడుకు వింటారా? - వీరి భయం వీరికి... కడుపునొప్పి... ఏమవుతుందో ఏమో ?... ఏమైనా అయితే అబ్బో....

సంచిలో కుక్కిన రూపాయల నుండి మూడు వేలు లెక్కించి కౌంటర్‌లో యిచ్చి రశీదు తీసుకొన్నాడు.

డాక్టర్ చకచకా పనులు ప్రారంభించాడు.

రక్త పరీక్ష, మూత్ర పరీక్ష అన్నాడు.

హైటెక్ ఆసుపత్రిలో ఆ వసతులు ఉన్నా - ఆ రాత్రి లేవు, రాత్రి వుండవు. కొడుకు భార్య ఆటోలో తీసుకెళ్లారు. పరీక్షలు చేయించారు, రిపోర్టులు తెచ్చారు.

వందలు లేచిపోయాయి.

ఆ రిపోర్టులు రాగానే ఎక్స్‌రే అన్నాడు డాక్టర్ అదీ బయటకెళ్లాల్సిందే !

మరో మూడు వందలకు కాళ్ళు వచ్చాయి.

ఎక్స్‌రే రాగానే -

రూము యిచ్చారు మందులు వ్రాసారు.

మందులకు మళ్ళీ పరుగో పరుగు నాలుగు దాటింది ఇంకా కోడి కూయలేదు.

మందులకు ఐదువందలకు పైగా లేచాయి. పర్సు ఖాళీ అయ్యింది. "అర్జంట్‌గా ఆపరేషన్ చేయాలి మరో మూడు వేలు కౌంటర్‌లో జమ చెయ్యి. కౌంటర్‌లో జమ చేయగానే ఆపరేషన్ అన్నారు".

సత్యనారాయణకు అన్నీ అర్థమవుతున్నాయి. మాట్లాడటం లేదు. మత్తుగా వుంది. గ్లూగోజ్ ఎక్కించారు ప్రక్కనే భార్య కూర్చుంది. కొడుకు చేతులు కట్టుకు నిల్చున్నాడు. డబ్బు కావాలి.

"ఇంటికెళ్దాం !" సత్యనారాయణ మూలుగుతున్నాడు వాళ్ళు వినరు. ఎవరి భయం వారిది.

సత్యనారాయణ నలుపది సంవత్సరాల అనుభవమున్న చిన్న డాక్టర్. ఇన్ని అవసరం లేదని ఆయన మనసులో వుంది. ఆయన మాట ఎవరు ఖాతరు చేస్తారు ! పాతకాలం మనిషి... అయినా ఆపరేషన్ ఏమిటీ? - ఒకేసారి.. మందులతో తగ్గకపోతే ఆపరేషన్. మందుల ప్రయోగమే లేదు ఒకేసారి ఆపరేషన్ అంటున్నారు ఇదేమిటి? - ఓయబ్బో డాక్టరా ? - వీడు దొంగా అనుకొన్నాడు మనసులో. అయితే ఆయన వున్న పరిస్థితులలో నోటమాట రావటం లేదు. ఆయన ఏదైనా అన్నా ఎవరూ వినే స్థితిలో లేరు. కడుపులో ఏమైందో తెలియదు. సిస్టర్ అంది "పేగు వుబ్బిందని"

డబ్బు

ఆ రాత్రి ఎవరిస్తారు ?-

మూడు వేలు కౌంటర్‌లో మళ్ళీ మందులు చిల్లర రెండువేలు కాదు పదివేలు తెప్పించాలి. ఇంట్లో లేవు. బ్యాంకు బ్యాలెన్స్ కలిగిన కుటుంబం కాదు.

ఆలోచించటానికి అవకాశం లేదు. మెడలో వున్న నాల్గుతులాల గొలుసు తన కొడుకుకు యిచ్చి 'షావుకారి కుమారస్వామిని లేపి ఓ పదివేలు ఈ గొలుసు పెట్టి ఎంత మిత్తి అయినా తీసుకురమ్మంది.

డబ్బు కథ తీరుతుంది.

మళ్ళీ కొడుకు సురేశ్ పరుగో పరుగు

గంటలో వచ్చాడు పదివేలు తీసుకొని....

కౌంటర్‌లో మూడువేలు జమ.

✿ ✿ ✿

ఆపరేషన్ ప్రారంభం.

✿ ✿ ✿

ఆపరేషన్ అవసరమా? - తప్పదా ? - ఆపరేషన్ లేకుండా మందులతో కాదా? - అడిగిన వాళ్ళు లేరు. ఎవరి భయం వారిది. ఈ నెల డాక్టర్ కోటా యింకా నిండలేదు. కోటా అంటే టార్గెట్. టార్గెట్ పేరుతో ప్రభుత్వం రకరకాల కోతి చేష్టలు

– రాక్షసాలు చేస్తుండగా లేనిది డాక్టర్ ఎంత ?

✿ ✿ ✿

ఆపరేషన్ సక్సెస్.

✿ ✿ ✿

ఆపరేషన్ విజయవంతం కాకపోతే ఏమౌతుందని !- కోసి అతికించటమేగా...? ఆ నైపుణ్యత డాక్టర్ చదువులోనే వుంది. ప్రత్యేక ప్రతిభ అక్కర్లేదు.

✿ ✿ ✿

ఐదు రోజులు గడిచాయి. సత్యనారాయణను ఇంటికి తెచ్చారు. చిక్కిపోయాడు... ఆయనకు అంతా అర్థమయ్యింది. నలుపది సంవత్సరాల డాక్టర్ ఆయన. గోటితో పోయేదానికి గొడ్డళ్ళ దాకా పూరికే అనలేదు పెద్దలు అనుకున్నాడు. రక్తపరీక్ష మూత్రపరీక్ష ఎక్స్‌రే ఆపరేషన్ అన్నీ అవసరం లేదు అనుకున్నాడు సత్యనారాయణ. ఓ వారంరోజులు మందులు వాడితే తగ్గేది అనుకున్నాడు సత్యనారాయణ.

అన్నిట్లో డాక్టర్‌కు వాటా వుంటుందని సత్యనారాయణను చూడవచ్చిన స్నేహితుడు కుమారస్వామి అన్నాడు.

అంతా దోపిడీ దుర్మార్గమనుకొన్నాడు సత్యనారాయణ. సత్యనారాయణ అలా అనుకోవ టంలో న్యాయం వుందో లేదో మనకు తెలియదు. అయితే ఆయన నలువది సంవత్సరాల అనుభవం వున్న డాక్టర్.

✿ ✿ ✿

ఎనిమిదిరోజులు నిశ్శబ్దంగా వూరుకున్నాడు సత్యనారాయణ. బాగా చిక్కిపోయాడు. ఆపరేషన్, వారంరోజులు ఆసుపత్రిలో వుండటంతో చిక్కి పోయానని ఆయన అనుకొంటున్నాడు. కడుపు నొప్పి రావటంతో చిక్కిపోయాడని ఇతరులనుకొంటున్నారు.

ఎనిమిదిరోజుల తర్వాత కొడుకు సురేశ్‌ను పిల్చి "నిన్ను డాక్టర్ చదివించటం లేదు" అన్నాడు. ఆశ్చర్యపోయిన కొడుకు ఎందుకని ప్రశ్నించలేదు. ప్రశ్నించే అవసరం ఆయనకు లేదు. ఆయనకు చదవాలని లేదు. మొదటి నుండి సురేశ్‌కు డాక్టర్ చదవాలని లేదు.ముసలి తల్లిదండ్రులని విడిచి వెళ్ళా లని లేదు. తండ్రి కడుపునొప్పి తర్వాత ఖచ్చితంగా చదువకూడదనుకొన్నాడు. తండ్రి ఆమాట అనటంతో ఆశ్చర్యం, ఆనందం సురేశ్ వంతయ్యింది. తండ్రి ఎందుకన్నాడో అర్థం కాలేదు.

ఎనిమిది రోజుల ఆసుపత్రి అనుభవం సత్యనారాయణకు ఎన్నో గుణపాఠాలు నేర్పింది. ఎందుకో ఆయన మనసులో డాక్టర్ వృత్తిపట్ల అనుమానాలు మొదలయ్యాయి. ఇప్పుడు డాక్టర్ వృత్తి పవిత్రంగా వున్నట్టు లేదు. డాక్టర్లను ప్రజలు మనసులో తిట్టుకుంటున్నారనే భయం సత్యనారాయణ మనసులో ప్రారంభయ్యింది. అలా తన కొడుకును ప్రజలు తిట్టుకోవటం ఆయనకు యిష్టం లేదు. ఇప్పటి డాక్టర్లు దొంగలు మోసగాళ్ళని సత్యనారాయణ అభిప్రాయం కాదు. డబ్బుకు కక్కుర్తి పడేలా వారి పనులున్నాయనుకొన్నాడు. వ్యవస్థే డబ్బు చుట్టూ పరుగులు తీస్తూ వుంది. అందులో డాక్టర్లు ఒకరు కావచ్చు గానీ ఇప్పటి డాక్టర్లు తమ వృత్తిని పచ్చ నోట్లకు అమ్ముకొన్నారా అనే అనుమానం ఆయన కొచ్చింది. ఆయన కడుపునొప్పి అనుభవం డాక్టర్లపై గౌరవం తగ్గించింది. తన కడుపునొప్పికి రక్తపరీక్ష, మూత్రపరీక్ష ఎక్స్‌రే ఆపరేషన్ అవసరమా? మందు లతో తగ్గుతుందో లేదో పది రోజులు చూడకుండా అన్నీ అర్జంట్‌గా... డాక్టర్ తన కడుపు నొప్పి బాగు చేయటం అంతా డబ్బుకొరకు చేసినట్టున్నాడు.

అటువంటి వృత్తిలోకి తన కొడుకును పంపకూడదనుకొన్నాడు సత్య నారాయణ. తన కొడుకు మంచివాడు కావచ్చు కానీ కాకుల మధ్య కోకిల బతకదు.

## తపాలా అబ్బాయి

రోజూ
గేటు చప్పుడైనప్పుడల్లా...
గుమ్మం వైపే నిరీక్షగా....
అతని రాకకోసం
తను తెచ్చే లేఖకోసం
కోటి కన్నుల ఆశలతో....
ఉదయంలా.. హృదయంగా....
సైకిల్‌బెల్ మోగించుకుంటూ అతనొస్తాడా...!
మా ఇంటికో పిచుకల గుంపు వచ్చినట్టే....
ఎందుకో... నాలో రావిచెట్టు గల గలల గోదారి సుడులు తిరిగినట్టుంది
నా ఏకాంతాన్ని భగ్నపరుస్తూ....
నిశ్శబ్దంతో బోసిపోయిన ఇంటినీ,
వేసారిన నా కళ్ళలోని నిరాశనీ ఆట్టే చెదరగొట్టిపోతాడు
అతను పదిలంగా తెచ్చిచ్చిన ఉత్తరం
నాలోని జ్ఞాపకాలను పలకరిస్తుంది
అనుబంధాల సుగంధ మాలికల్ని అల్లుతుంది
నిర్వచించలేని అనుభూతుల మకరందాన్ని పంచుతుంది
భావోద్వేగాల వర్షంలో తడిపి
నా కన్నుల్లో దుఃఖానందాల జుగల్బందీ రాగమై ప్రవహిస్తోంది
తానో పక్షై తన రెక్కలమీద కూర్చోబెట్టుకొని
భూమ్యాకాశాల సరిహద్దుల్ని చెరిపేస్తుంది
నీలో మాటల్లో చెప్పలేని మౌనాలేమైనా వుంటే
నా చెవిలో వెయ్
అక్షరాలా... బరువెక్కిన మనసును సైతం
మాట్లాడే మల్లెమొగ్గను చేసి
అవతలి ఒడ్డుకు చేరుస్తానంటుంది
ఈ ప్రపంచానికి నేనో ప్రియురాలినంటుంది
కన్నీరు తుడిచే చేతులు నేనంటుంది
నీలో కన్నీరై బతికివున్నా మనిషితనాన్ని నేనేనంటోంది
పొట్టి భాషల పొడిపొడి మాటల
ఖరీదైన మాయలపెట్టె కన్నా
హృదయ చాలనంతో
అంతరంగాలనావిష్కరించే
మనిషి చిరునామాయైన
ఉత్తరమంటే నాకిష్టం
ఉత్తరం సాక్షిగా....
సముద్రాల ఆవలి సంగతుల్నైనా చేరవేసే
ప్రేమానురాగాల్ని పదిలంగా బట్వాడా చేసే
చిరునవ్వుల హరివిల్లై విరిసే
తపాలా అబ్బాయంటే
అమ్మంత ప్రేమ –

– జైత్ర (బండి రుక్మిణీప్రసన్న)